నల్లపొంగులు

వి. దుర్గాప్రసాదరావు

"దీనా దీనా! అదేమిటే ఆపుంజు పెట్ట నల్లాపొడుస్తోంది!" అని తార దినమణికి చూపించింది.

"నీసిగ్గుచిమిడిరికదే!" అని దీన తారబుగ్గలను పిడికిళ్లతో పొడుస్తూ అటునించి చూపుమరల్చి గుంభనపు నవ్వు నవ్వింది.

తార తెల్లబోయి చూసింది. తార కేమీ అర్థమవలేదు. తల్లిచాటున పెరిగినపిల్ల కాదు. తండ్రిపోషణ, చాలానాళ్లవరకు తండ్రినితప్ప ఇతరలోకం ఎరుగదు. దీన కొత్తగావచ్చినపొరుగువాళ్ళపిల్ల. ఇద్దరూ ఒకేఈడువాళ్లు. పొటికరిస్తూన్న జవ్వనము. దీన స్త్రీప్రపంచములో పెరిగినపిల్ల. చిన్ననాటినుంచీ ఊహలు పెద్దవి. ప్రపంచమంతా ఊహించుకోగలశక్తిగలది. తారో, అమాయకురాలు. ఆమె ప్రశ్నలో అమాయకత్వం తప్ప మరేమీ లేదు. చిన్ననాటినుంచీ తోటిపిల్లలు చెప్పేకథలూ, అవీ విన్నదీనకి తార తన్నుమించినజాణ అనిపించింది. లేకపోతే అంతనిర్లజ్జగా అడిగిఉండదు అనుకొంది. అమాయకత్వం అని ఎంతమాత్రమూ తోచలేదు

"దీపాలెడుతున్నారు. నేపోతాను" అంది దీన.

"కొంచెం ఉండవే. మానాన్న ఇప్పుడే వస్తాడు. సరేకానీ. దీనాఎందుకే—"

"ఏం నంగనాచివే!-నే పోవాలమ్మా, మాఅమ్మ తిడుతుంది" అంటూ దీన లేచి వెళ్లిపోయింది.

ప్రొద్దుగూకిందని తారకూడా లేచి కసవూడ్చి నీళ్లు చల్లి వీథిగుమ్మాలకు ముగ్గెట్టి, ఇంట్లో దీపాలువెలిగించింది. ప్రొద్దున్న చాకలి తెచ్చినమడత కట్టి వంట ముగించుకొని తండ్రికోసం ఎదురుచూస్తూ గుమ్మంలో నిల్చుంది. ఎంతసేపటికీ తండ్రి రాలేదు. "అయ్యవచ్చాక భోంచేస్తాడు. ఆకలేస్తోం"దని తనుపెట్టుకొనితిని, మళ్లీ తండ్రికోసం వీథిగుమ్మంలో ఎదురుచూస్తూ నిలబడ్డది. మునుపు కొన్నిమాట్లు ఇలాగే ఆలస్యంగా వచ్చాడు తండ్రి. ఒకొక్కప్పు డర్ధరాత్రి అయేది.

నూరుగజాలలోపున ఇళ్లు లేవు. ఇళ్లవరుసకు కొంతఇవతలగా సందుమొగలో మ్యునిసిపల్ లాంతరొకటుంది. ఆదీపానికి కొద్దిదూరంలోనే తారాడుతూ ఉన్న ఒకవ్యక్తి. తార అతన్ని చూడలేదు. ఆలోచిస్తూ తండ్రికోసం తార అక్కడేకూర్చొని చూస్తోంది.

తారకు మళ్లీ కోళ్లు మనస్సుకు వచ్చాయి. పుంజు పెట్ట నెందుకు బాధపెట్టింది? ఆమాటడిగితే దీన అల్లా ఎందుకు నవ్వింది? దీననవ్వులో సిగ్గు,రహస్యము ఉన్నాయి. తార కేమీతోచలేదు. నాయననడిగితే! ఎందుకో తండ్రినడగకూడదని తార కనిపించింది. తల్లి ఉంటే తల్లి నడిగేది. తనతల్లి ఎలాఉండేదో తార సరిగ్గా ఎరుగదు. కాని తల్లిరూపం చిననాడెప్పుడో తనకు తెలియకుండానే ఆమెచిత్రించుకొన్నది. రాను రాను అదే తల్లినిజరూపమని ఊహలో ఉన్నది. ఆ రూపనైజాన్ని ఆమెఎప్పుడూ ప్రశ్నించలేదు. ఆతల్లి రూపమే అప్పుడామెను వ్యామోహితనుగా చేసింది. తల్లిఉంటే ఎన్నో అడుగుదు ననుకొంది. దీనకు తల్లి ఉండబట్టే ఆసంగతి తెలుసు. దీనకు తప్పకుండా తెలుసు. లేకపోతే అలానవ్వదు. ...

దూరాన్న దీపంవంక చూస్తూ ఆలోచిస్తూన్న తారకు అకస్మాత్తుగా ఒకమొగము కనపడింది. తండ్రి మొగమేమో అని చూసింది. కాదు. కాని ఎవరో ఆమె చూచినమొగమే.

అకస్మాత్తుగా ఆమెకు జ్ఞప్తికివచ్చింది. ప్రొద్దున్నదీనతో నీళ్ళకు పోయినపుడు బిందెలు క్రిందకు దించి ఇద్దరు రేవులో నవ్వుతూ మాట్లాడుకొంటూన్నారు. ఆమెప్రక్కకు తిరుగుండి దీన హాస్యాలకి నవ్వింది. దూ

"ఆలోచిస్తూ తండ్రికోసం తార అక్కడేకూర్చొని చూస్తోంది."

రాన్న ఈమనిషి నిలబడి మీసం సన్నగా దువ్వుతో మందహాసం చేశాడు. ఆమె హాసం ఆగిపోయింది. తొందరగా నీళ్లు నింపుకొని బయలుదేరి అతన్ని దాటి దూరంవచ్చాక "దీనా, ఆమనిషెవరే" అని అడిగింది "జమీందారుకొడుకు, చాలాచెడ్డవాడు." తార ఊరికే "ఏంచంపుతాడా ఏమిటే" అంది పరాకుగా. "నీమొహం! చంపడు! ముద్దెట్టుకొంటాడు; కాదు ముద్దులతో చంపుతాడు" అని నవ్వటం మొదలుపెట్టింది. దీనమాటలు తార కర్థమవలేదు. ప్రొద్దున్నా అవలేదు. సాయంత్రం అంతకంటేను. తారకెందుకో ఒళ్ళు గగుర్పొడిచింది. నిద్రపోతాననుకొని తలుపు గడెవైచి పడుకొంది.

ఏవో ఆలోచనలతో నెమ్మదినెమ్మదిగా కునుకుపడుతూ ఉంది. ఎందుకో మళ్ళీమళ్ళీ జమీందారు కొడుకూ, చిరునవ్వూ, కోళ్ళూ, తార వ్యంగోక్తులూ మనస్సుకు వచ్చాయి. ఆమెకేమీ అర్థమవలేదు. అల్లాగా కునుకుపడుతూంది.

వీథి తలుపు కొట్టినచప్పుడైంది. ఆమెపంచేంద్రియాలూ నిద్రపోతూన్నాయి. సగముమనస్సు నిద్రపోతూంది. సగముమనస్సు అలవాటుచేత మెళకువగా ఉంది. ఆసగము మనస్సు ఆ చప్పుడువింది. నిద్రలో ఆమెవెళ్ళి తలుపు గడతీసి నిద్రపోతూనే మళ్ళీ వచ్చి పడుకొంది.

ఆమెకు కలవచ్చింది. ఆమె వక కోడిపెట్టయినట్టు. ఒక పెద్దకోడిపుంజు ఆమెచుట్టూ తిరగడం మొదలు పెట్టింది. ఆమెకు తప్పుకొనేందుకు త్రోవ కనబడలేదు. అకస్మాత్తుగా ఆపుంజు ఆమెను తనరెక్కలతో ఆవరించింది. తనగోళ్ళతో ఆమెగుండెలను చీరటం మొదలుపెట్టింది. ముక్కుతో ఆమెమొగమంతా పొడవడం మొదలుపెట్టింది.

ఆమెకు ఇది కలఅన్న జ్ఞానము తప్పలేదు. కాని అజ్ఞానము. ఆమెలో మహాభయము కలిగించడం మాన

లేదు. ఆమె కళ్ళు తెరవటానికి ప్రయత్నం చేసింది. కాని కంటిరెప్పలు విప్పుకోలేదు. గట్టిగా కేకవేయబోయింది. తనకేక తనకే వినబడదు. "ఇది చెడ్డకలమటుకే!" అని మనస్సుకు ధైర్యం చెప్పుకోటం మొదలుపెట్టింది. కాని ఆమెకు భయ మాగలేదు.

ఆపుంజు ఆమెనింకా బిగ్గగాఆవరించింది. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వేగిరించాయి. ఆమెగుండె దడదడ కొట్టుకొంటూంది. రక్తమంతా ఆమెగుండెలకు ఆమెముఖానికి పాకింది. ఆమెవొళ్ళంతా అతిఆవేగంతో వొణికిపోయింది. ఈభయావస్థ తప్పించుకోటానికి అతిప్రయత్నంతో మొగము పక్కకు తిప్పుకొంటూ అస్ఫుటంగా గొణుగుకొంది. బలవంతాన కళ్ళు తెరచి మళ్ళీ కళ్ళుమూసుకొని కెవ్వున కేకవైచింది. ఆమెగుండె కొట్టుకోగలిగినంతవేగంగా కొట్టుకొని కొట్టుకోటం మానివేసింది. ఆమెఉచ్ఛ్వాసనిశ్వాసములు లేవు.

జమీందారుకొడుకు తెల్లబోయాడు. తననిండు కౌగిలిలోనుంచి ఆమెను వదలేశాడు. ఆశరీరం అల్లాగే బిగుసుకుపోయింది.

౨

జమీందారుకొడు కిక్కడంతా యేమీ అర్థం కాలేదు. అతని కిది అపూర్వానుభవము. అతని కౌగిలిలో మును పెంతబలవంతపెట్టబడినస్త్రీకూడా చనిపోలేదు. అతనితల గిఱ్ఱున తిరిగిపోయింది. అతనివ్యాపారాలలో ఇంతకుమున్నెప్పుడూ అతనికి చలనము కలగలేదు. నేడతనిమనస్సు క్షుభితమైపోయింది.

అతనికి నాటిచర్యంతా మనస్సులో గిఱ్ఱున తిరిగింది. ఆమెను ప్రొద్దున్న నీలాటిరేవులో చూశాడు. పదారేండ్లజవ్వనము. నున్ననిచెక్కులు. అమాయకపుపెదవులు. ముద్దులగాని వర్ణించలేని కంఠము. అతనికర్థంకాని జ్యోతు లీనేకళ్ళు. నవ్వుతో అతనివంక చూసింది. అతన్నిచూసి న వ్వాపేసింది. కాని జవ్వనిలక్షణం అది. విముఖత్వం అని కాముకు డనుకోడు. స్వర్ణప్రతిమలాంటి ఆమెరూపము తడిసినచీరలో సగముసగము కనబడి పూర్ణనగ్న స్వరూపంకన్న వేయిరేట్లు మోహితుణ్ణి చేసింది. తనకాముకత్వానికి ఇంతకుముందు అత నడ్డెరుగడు. ఇప్పు డుండవచ్చునని తోచనైనా తోచలేదు. మును పెందరో అతనిసౌందర్యానికి దాసీలయారు. తరువాత కొందరు స్వచ్ఛమైనస్త్రీలను అతను బలవంతపెట్టి చెరిచాడు. ఆలాలసవృత్తి అతనిలో పెరిగిపోయింది. కాని పాపాచరణ మన్నబుద్ధి అతని కెప్పుడూ తోచలేదు. తోచుటకు తీరిక కలుగలేదు. సహజంగా సౌందర్యమూర్తి; అంతకన్నా తనసౌందర్యాన్ని తనుకుర్తించినవాడు. అనేకమందిస్త్రీలచే నవమన్మథుడని పొగడబడ్డాడు. నే డొకపసిబాల అతన్ని కాదంటుందా? అతనిరసికత్వ మంతేనా.

ఆమెవెంట దూరానపోయి ఆమెయిల్లు గుర్తుపట్టాడు. రెడ్డికూతురు. రెడ్డి భయంకరుడు. అపాయం జారుడికామాన్ని వృద్ధిపరుస్తుంది. దానికొక ఔన్నత్యం కలిగిస్తుంది అతనిమనస్సులో.

రెడ్డి ఊళ్లో లేడని తెలుసుకొన్నాడు. సాయంత్రం చీకటిపడ్డతర్వాత ఆయింటిసమీపాన కాసేపు తారాడి, పిల్ల ఒక్కరితేఉండటం గ్రహించి, యింటిదగ్గరకు వెళ్ళి మెల్లిగా తలుపుకొట్టాడు. ఆమెవచ్చి తలుపుతీసి వెంటనే చరాలున లోపలికి పోయింది. ప్రౌఢలనెరిగిన అతను, ఆమె తప్పకుండా తన్ను మోహించిం దనుకొన్నాడు. ఆమెపోయినత్రోవనే లోపలికి పోయాడు. ఆమెమంచంమీద పడుకొనినిద్రనటిస్తూంది. స్త్రీలు మును పిట్టినటనలు చూపించటం అతనెరుగును. కాని ఇంత బాగా మును పెవరూ నటించలేదు. ఆమె జాణతనమును అభినందించుకొన్నాడు. నిద్రగొప్పగానటిస్తూంది. ఆమెనుదురు క్షీరసముద్రంలా గున్నది. ఆమె చెక్కులు పాలుకారుతున్నట్లనిపించాయి. నిద్రపోతూన్న సముద్రంమీద అలల్లాగు ఆమెపైట లేస్తూ పడుతూఉంది. బహుజాగ్రత్తగా ఆమెకు తెలేకుండా అత డామె నాచ్ఛాదితనుగా చేశాడు. గట్ల నెరుగని కామం అతనిలో వెల్లువలై పోయింది. రాహువు చంద్రునట్లు అత డామెను కప్పేశాడు. అతనిచేతు లామె నావరించాయి. అత డామెమొగమంతా ముద్దులతో నింపేశాడు. ఆమె అతనిముద్దు తప్పించుకొంటూ వద్దువద్దని గొణుగుతో పక్కకు తిరిగింది.

పూర్తిగాచెలరేగిన అతనికామాన్ని అతడే ఆపలేకపోయాడు. ఆమెను మరింత బిగ్గ కౌగిలించుకొన్నాడు. ఆమె కళ్ళు తెరిచి మరల మూసికొని కెవ్వున కేకనైచి బిగుసుకుపోయింది.

అతనికామము ఆక్షణమ అతన్ని విడిచి పోయింది. విస్మయభయాలతో ఆమెను వదిలి అతను లేచాడు. ఆమె కదలలేదు. అట్లాగే బిగుసుకుపోయింది.మళ్ళీ ఆమె వక్షముపై చేయిపెట్టి గుండె ఆడుతున్నదా అని చూశాడు. ఆచెయ్యి ఆక్షణాన కామము ఎరుగదు.

అతనిగుండె దడదడ కొట్టుకొన్నది. కామము వదిలిపోయిన కంకాళాన్ని భయము ఆవేశించింది. అతని మోకాళ్లు బరువు లెక్కాయి. అంతనిస్సత్తువ అతనెప్పుడూ ఎరుగడు. అంతవరకు నిశ్చలంగా ఉన్న కిరసనాయిలుబుడ్డిదీపము గంతులువేయడం మొదలుపెట్టింది. దీపంక్రీనీడలు గదిగోడలనిండా పిశాచీనృత్యాలు మొదలుపెట్టాయి.

ఆమెవంక చూస్తూ నిర్ఘాంతపోయి అత నలాగే నిలుచున్నాడు. అంతవరకూ అతనెరుగని ప్రకృతి ఒకటి అతనిలో బయలుదేరింది.

"పసిబాలను నీకామాంధతచే హత్యచేశావు" అని ప్రకృతి గట్టిగా అరవడం మొదలుపెట్టింది. అతను గట్టిగా చెవులుమూసికొన్నాడు. "హత్య! హత్య! పసిబాలను నీకామానికి బలియిచ్చావు" అంటూ అంతఃకరణ ఇంకాగట్టిగా అరవడం మొదలుపెట్టింది. అతను మూల్గుతూ "నేనుకాదు" అనిగట్టిగా అన్నాడు. "నేనుకాదు" అని ప్రతిధ్వని అతనికి గట్టిగా వినపడింది. అతను నలువంకలా చూశాడు. మళ్ళీ ఆమెముఖమువంక చూశాడు. ఆమెముఖములో ఆభీతి అల్లాగే చిత్రింపబడి ఉంది. "అయితే నేనే ఈహత్య చేశానా" అనిమెల్లగా అతను



" ఆమెవంకచూస్తూ నిర్ఘాంతపోయి అత నలాగేనిలుచున్నాడు."

రోదించాడు. "ఆ! ఔను!" అంటూ గట్టిగా అతని అంతఃకరణ జవాబు చెప్పింది. "అన్యాయము! అన్యాయము!" అని అతను సన్నగా విలపించాడు.

"ఆమె నావంక చూసి నవ్వింది. లేకపోతే నేనామెను మోహించను."

"అబద్ధం! ఆమె నీవంక చూసి నవ్వాపేశింది. నిన్ను కామాంధకారం కప్పింది."

"మరి ఆమె తలుపెందుకు తీసింది"

"నువ్వెరుగుదువు. ఆమెతండ్రి అనుకొని తీసింది"

"లేదు! అంతాఉత్తది. నామోహాన్ని ఆమె ప్రేరేపించింది. నాకౌగిట మహాఉద్రిక్త అయింది."

"మూఢుడా! ఉద్రిక్త కాదు. భయంచే ఆమె నాడులు, నరాలు ఉబికిపోయినవి. ఆమెరక్తవేగం నీ కామానికికాదు, భయంచేత. ఆమె నీకౌగిలికి చచ్చిపోయింది."

"అంతా అబద్ధం! అంతాఅబద్ధం" అంటూ అతను లోపల ఏడ్పుమొదలుపెట్టాడు. కొంచెం పెద్ద గాలిచే కిటికీతలుపు కదలి చప్పుడయింది. ఆ గాలి చలికి దగ్గిరపొదలో గుడ్లగూబ కూతపెట్టింది. అతను మెళుకున్నాడు అప్పటికి. అతనికి పారిపోవాలని బుద్ధి కలిగింది. ఆ తరువాత అక్కడ నిలవటాని కతనికి ధైర్యం చాలలేదు. గుమ్మందాకాపోయి వెనుకకు చూచాడు. అతనిదృష్టి ఆమెఅనాచ్ఛాదితదేహముమీదికి పోయింది. వెనుకకుపోయి, ఆమెచీరతో ఆమెఒళ్ళంతా కప్పేడు. ముఖమువంక చూడకుండామని అతిప్రయత్నం చేశాడు. అతనికి తెలియకుండా అతనికళ్లు వాలుచూపులు చూచాయి. ఆ ముఖంలో "జాలి" అతన్ని వణికింపచేసింది. ఏముఖం అతన్ని అక్కడకు లాక్కొచ్చిందో ఆ ముఖమే అతన్ని అక్కడనుంచి తరిమేసింది. మరల వెనుకకు తిరగకుండా వీధితలుపు చేరవైచి అతను మెట్లు దిగాడు. ఒక్కసారిగా అతని కాళ్ళల్లోకి విపరీతమైనశక్తి వచ్చింది. అతను పరుగెత్తడం మొదలుపెట్టాడు. దీపస్తంభం వద్ద అతనొకవ్యక్తిని రాచుకొంటూ పోయాడు. ఆ వ్యక్తి మొగం కొద్దిగా కనుపడ్డది. రెడ్డి.

ఎక్కడికో తెలియకుండా ఇంకా పరుగెత్తడం మొదలుపెట్టాడు. గుడ్డిఎద్దులాగు తిరిగినపచ్చికతే గుండ్రంగా తిరగటం మొదలుపెట్టాడు. అతనితల గిఱ్ఱున తిరుగుతోంది. అతనుచెరిపినస్త్రీలు అనేకరూపాలు దాల్చి అతనిముందర వికటాట్టహాసాలు మొదలుపెట్టారు. అతనికి లోకంఅంతా తన్ను అన్యాయం చేస్తోందనిపించింది. తన్నాబాల ప్రేరేపించినదని ఎన్నోమార్లు తనకు గట్టిగా చెప్పుకొన్నాడు. కాని అతనిలో ఆవేళ ప్రేరేపింపబడిననూతనప్రకృతి అంతఃకరణ అతని మాటలు వినలేదు. అతనిపూర్వకృత్యాలన్నిటికీ ఇప్పుడే అతన్ని ఈసడించటం మొదలుపెట్టింది. పశ్చాత్తాపమనేది అంతకుముందెప్పుడూ అతనెరుగడు. అందుచే ఈ కల్లోలము ఆదుకోలేకపోయాడు.

ఇంతలో ఎవరో వెనుకనుంచి దుడ్డుకఱ్ఱతో అతనినెత్తిమీద గట్టిగా కొట్టారు. అతనితల దిమ్మెక్కిపోయింది. అబ్బాఅంటూ అతను స్మృతిఎరుగకుండా పడిపోయాడు. అతన్ని అంతఃకరణ ఇక బాధించలేదు.

3

రెడ్డి యింటికివచ్చి తలుపుదగ్గిర "తారా!" అని కేకవేశాడు. బదులు లేదు. అతను తలుపుకొట్టబోయాడు. తలుపు తెరుచుకొంది. అతనిమనస్సు కీడుశంకించింది. నెమ్మదిగా లోపలప్రవేశించి "అమ్మాయీ! అమ్మాయీ!" అంటూ కేకవేస్తూ నలుదిక్కులా కలయచూశాడు. గదిలో పరుపుమీద పడుండివున్నది కూతురు. అతనికేదో భయము వేసింది. ఆమెముఖంలో భీతి అతనుగ్రహించకపోలేదు. "అమ్మాయీ" అంటూ జబ్బపట్టుకు లేవదీయపోయాడు. వళ్ళు చల్లగా కొయ్యబారిఉంది. అతనికి దుఃఖము పొంగుకొంటూ వచ్చింది. ఆపుకొని దగ్గిరఉన్న డాక్టరుదగ్గిరకు పరుగెత్తాడు. డాక్టరు వచ్చి చూసి పెదవివిరిచాడు.

"అయ్యా, ప్రొద్దున్న కులాసాగానే ఉందండి. పురుగేమైనా ముట్టిందా" అని అతిదీనంగా అడిగాడు

రెడ్డి. డాక్టరు రెడ్డివంక చూసి "రెడ్డీ, నువ్వు ధైర్యము గలవాడవు కనుక చెపుతున్నాను. ఈమె అకస్మాత్తుగా గుండె ఆగిపోవటంచేత పోయింది. ఈమెకు అసలు గుండె జబ్బున్నదనుకోను. ఒకమహాభయము ఈమెను కలిచివేసింది." అని నెమ్మదిగా "ఈమె నెవరో బలవంతము చేశారు. కామవృత్తి ఎరుగని ఈమె ఆ ఉద్రేకంచేత భయంచేత చనిపోయింది."

రెడ్డి కకస్మాత్తుగా దీపందగ్గిర తన్నుతోసికొని పరుగెత్తినవ్యక్తి జ్ఞప్తికివచ్చాడు. జమీందారుకొడుకు! ఇంతవరకూ ఏదోగా తనమనస్సు చెప్పతున్న సంగతి అతని కొక్కసారిగా వ్యక్తమయింది. తన ఏకపుత్రిని మానభంగము చేసి చంపినవానియెడ ప్రతిహింస ఒక్కసారిగా అతన్ని ఆవరించింది. తలుపు చాటున పెట్టిన దుడ్డుకఱ్ఱ పుచ్చుకొని వీథినిపడి జమీందారుకొడుకు పోయినత్రోవను పరుగెత్తాడు. జమీందారుకొడుకు పచ్చికబయలులో గుండ్రంగా తిరుగుతున్నాడు. వెనుకగా పోయి అతనితలమీద గట్టిగా మోదాడు. అతని తల పగిలింది. అబ్బాఅంటూ మొదలు నరికిన చెట్టులాగ అతను నేల కూలిపోయాడు.

రెడ్డికి తెలివివచ్చింది. నీటిచుక్కతో పాల పొంగు చల్లార్తుంది. రక్తదృశ్యాన్నగాని రక్తపుపొంగు చల్లారదు. అతని రక్తోద్రేకం తగ్గాక అతనికృత్యం అతనికి కన్నులకట్టినట్లయింది. తనుచేసినహత్యవల్ల తనగర్భశోకం ఏమాత్రమూ చల్లారలేదు. హింసకు ప్రతిహింస విధానము కాదని అతనికి అప్పుడు తోచింది. అతని జీవితం నిరాశాపూరితము.

రెడ్డి సరాసరి మేజస్ట్రేటుగారింటికి పోయి నిద్రలో ఆయనను లేపి, "అయ్యా, నేను జమీందారు కొడుకుని చంపాను, నన్ను ఖైదుచేయండి" అన్నాడు. నిద్రలో లేచిన మేజస్ట్రేటు కేమీ అర్థంకాలేదు. అతనికిది కలలాగున తోచింది. ఇద్దరు జవానులకు "ఇతన్ని రిమాండులో ఉంచం"డని ఆజ్ఞాపించాడు.

„అబ్బాఅంటూ మొదలునరికిన చెట్టులాగ అతను నేల కూలిపోయాడు."

తీర్పులో ఆతనికి ఆజన్మఖైదు విధించారు.

౪

పదిఏండ్లకు రాజుగారిజన్మదినోత్సవమున "మంచి నడతగల పాతఖైదీలను వదిలేయమని" ఫర్మానా వచ్చింది. వార్డరు ఖైదీలను వదలుతూ తనకుతోచిన నీతులు చెపుతూ సల్లాపాలాడుతూ వాళ్ళను విడుదల చేస్తున్నాడు

"నెంబరు ౭౬"

ఒకవృద్ధుడు ఒకక్రోటనులో పూలమొక్కలోని నక్షత్రంలాంటి ఒకచిన్నపూవును అతిప్రేమతో తన వేళ్లఎముకలతో నివురుతున్నాడు. తనకన్నీటితో అత నామొక్కను పెంచాడు.

"నెంబరు ౭౬"

వృద్ధుడు తలత్రిప్పి అతనివంక చూశాడు "నిన్ను విడుదల చేశారు. నీకు కావలిస్తే ఆమొక్క తీసుకు పోవచ్చును." వార్డరుది జాలిగుండె.

వృద్ధుడు లేచి బయటకు క్రోటను పట్టుకొని వెళ్లాడు.

వార్డరుకు అతనిచరిత్ర జ్ఞాపకమునకు వచ్చింది. "పాపము ఇత నమాయకుడు, శిక్షకు తగడు."

ముసలివాడా మొక్కను పట్టుకొని మరల యథాస్థానమునకు వచ్చి కూర్చొన్నాడు!

"మళ్లీవచ్చావేం" అన్నాడు వార్డరు ఆశ్చర్యంతో. ముసలివాడు మాట్లాడకుండా స్థిరంగా అక్కడే కూర్చొని, "తారా!" అని ఆ పూవును ముద్దెట్టుకొని సాంధ్యాకాశమువంక చూశాడు.

ఆకాశవీథి వొంటరిగా మెరుస్తూన్న తార అతని వంక చూసి మురిసింది.

చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును శగ(గనేరియా)వ్యాధికిని క్రొత్తగాకనిపెట్టబడినదివ్యౌషధము

గోనోకిల్లర్ (రిజిష్టర్డు)

ఈమహౌషధము ఇంగ్లీషుమందులను దేశీయఔషధములను పుచ్చుకొనినను గుణముకలుగనియెడలను, యింజక్షనులవలనను వాక్సినులవలననుగూడ లాభము లేకపోయినయెడలను కడపటిప్రయత్నముగా మా గోనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గోనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ఝూకీగా వెడలును. మూత్రముపోవుచున్నపుడు కలుగుమంట తగ్గిపోవును. మూత్రనాళమునందలివాపుతీసిపోవును. శగవ్యాధి (గోనోకోకసు)వలన మూత్రముబొట్లుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండిపోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు: మూత్రద్వారముయొక్క చుట్టువుండు పొరయొక్క వాపు: మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, నరములజబ్బు, మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గోనోకిల్లరువలన కుదురును. వీర్యము(సెమను)పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3-0-0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వీ. పీ. చార్జీ ప్రత్యేకము అడ్రసు:—డాక్టరు డి. యన్. జస్సాని, గిర్‌గాము వెనుకరోడ్డు, బొంబాయి 4.

కృత్రిమములు చూచి మోసపోకుడు. "కోడి" మార్కు గమనింపుడు.

Dr D. N. JASANI, Girgaon Back Road, Bombay, 4.
Madras Agents:--DADHA & Co., 52, Nainiappa Naick St, P. T. Madras